

విలేకరులతో మాట్లాడుతున్న ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఈశ్వర్

# దళితుల ఆత్మబంధువు సీఎం కేసీఆర్

- ధర్మపురి అంతటికీ ఒకేసారి దళితబంధు ప్రకటన వరంలాంటిది
- హుజూరాబాద్ తరహాలో అమలు చేస్తామనడం హర్షనీయం
- దళితుల పక్షాన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, నవంబర్ 3: దళితుల ఆత్మబంధువు సీఎం కేసీఆర్ అని, గురువారం ధర్మపురిలో నిర్వహించిన ప్రజాశీర్వాద సభలో నియోజకవర్గంలోని దళితులందరికీ హుజూరాబాద్ తరహాలో ఒకేసారి దళితబంధు ఇస్తామని ప్రకటించడం హర్షనీయమని ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హుజురాబాద్‌లో 18వేల దళిత కుటుంబాలకు దాదాపు రూ.2వేల కోట్లు ఖర్చు చేసి దళిత బంధు ఇచ్చారని, అక్కడి దళితులంతా పలురకాల వ్యాపారాలు చేసుకుంటూ యజమానులుగా మారిపోయారని చెప్పారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ధర్మపురిలో కూడా అక్కడి మాదిరే ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 20వేల దళిత కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రాంత దళిత కుటుంబాల పక్షాన సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. ఒక దళిత ఎమ్మెల్యేగా దళితులందరికీ దళితబంధు వర్తింపజేయడం అంటే జీవితానికి ఇంతకంటే సార్థకత ఏముంటుందన్నారు. సీఎం కేసీఆర్ మాట ఇచ్చారంటే అది రామబాణం వేసినట్లేనన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలనే కాదు, ఇవ్వని హామీలను సైతం అమలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని కీర్తించారు. సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను దళిత కుటుంబాలు తిప్పికొట్టాలని, వచ్చే ఎన్నికల్లో ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థినైన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు..

ధర్మపురిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి ఈశ్వర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో ఒక్క పిలుపుతో నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి తండోపతండాలుగా సభకు తరలివచ్చారని, వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, జడ్పీటీసీ అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పెగడపల్లి: సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు

# దళితుల ఆనందహేల

- ధర్మపురిలో అందరికీ ఒకేసారి దళితబంధు ప్రకటనపై హర్షం
- ఊరూరా సంబురాలు
- సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు పాలాభిషేకం

ధర్మపురి రూరల్/పెగడపల్లి, నవంబర్ 3: దళిత లోకం నవ్వుతున్నది. హుజూరాబాద్ తరహాలో ధర్మపురి నియోజకవర్గంలో అందరికీ ఒకేసారి దళితబంధు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై మురిసిపోతున్నది. శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఊరూరా సంబురాలు చేసుకున్నది. సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ, కృతజ్ఞతలు చాటింది. ధర్మపురి పట్టణంలోని దళిత సంఘాలు అంబేద్కర్ చౌక్ వద్దకు ర్యాలీగా చేరుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలను పాలాభిషేకం చేశారు. అలాగే పెగడపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మండల పార్టీ, దళిత సంఘాల నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. దళిత సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకం ధర్మపురి నియోజకవర్గంలోని దళితులందరికీ ఒకేసారి వర్తింపజేస్తామని ప్రకటించడం ఆనందదాయకమన్నారు. ప్రతి దళితకుటుంబం బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

# రైతురాజ్యం కావాలా.. రాబందుల రాజ్యం కావాలా?



ఇస్లాంపూర్‌లో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- ప్రజలరా మీరే ఆలోచించాలి
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కటిక చీకట్లే
- బీఆర్ఎస్ సర్కారుతోనే అభివృద్ధి
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

గంగాధర, నవంబర్ 3: 'తెలంగాణలో రైతు రాజ్యం కావాలా..? రాబందుల రాజ్యం కావాలా..? పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులు మళ్లీ టార్చిలైట్లు పట్టుకుని పొలాల కాడికి వెళ్లే దుస్థితి వస్తుంది. బీజేపీకి ఓటు వేస్తే కుల, మత రాజకీయాలు తప్ప అభివృద్ధి ఉండదు. ఏది కావాలో ప్రజలే ఆలోచించుకోవాలి' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమ పార్టీ అని, కాంగ్రెస్ స్కాముల పార్టీ అని, బీజేపీ మత రాజకీయాల పార్టీ అని స్పష్టం చేశారు. నవంబర్ 30న కారు గుర్తుకు ఓటు వేసి రైతు రాజ్యానికి జై కొట్టాలని పిలుపునిచ్చారు. గంగాధర మండలంలోని ఇస్లాంపూర్, కొండాయపల్లి, వెంకటాయపల్లి గ్రామాల్లో శుక్రవారం రవిశంకర్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణలో రైతులకు మూడు గంటల కరెంటు చాలని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దు అంటూ వ్యవసాయాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కర్ణాటక దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఐదు గ్యారెంటీలను అమలు చేయలేక ఆ పార్టీ చేతులెత్తేసిందని, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో వస్తున్న ఆ పార్టీని నమ్మవద్దని కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆయాచోట్ల ప్రచారంలో ఎంపీపీ శ్రీరాం మధుకర్, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా మోతె పార్టీ కార్యాలయంలో పొరండ్ల, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

# అక్కడ ఇవ్వనోళ్లు ఇక్కడ ఇస్తరా..?

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.వెయ్యికి మించి పింఛన్ లేదు
- వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలే
- గెలిచేదాక ఓ మాట.. గెలిచిన తర్వాత ముంచుడే
- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- అల్లీపూర్‌ను మండలంగా చేసి తీరుత
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్
- బీఆర్ఎస్‌లోకి పొరండ్ల, లక్ష్మీపూర్ గ్రామాల నాయకులు, మహిళలు

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 3: 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకే వారంటీ లేదు. వాళ్లు ఇచ్చే హామీలకు గ్యారంటీ ఉంటదా..? ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఇస్తున్నరు. రూ.4వేల పింఛన్ ఇస్తరట. నమ్ముదామా..? నేనొక్కటే చెబుతున్నా.. వాళ్లు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ.వెయ్యికి మించి పింఛన్ ఇవ్వడంలేదు. అక్కడ ఇవ్వనోళ్లు.. ఇక్కడ ఇస్తరా..?, ఆడబిడ్డల పెండ్లికాడికి వచ్చి తినిపోయేటోళ్లు.. వీసమెత్తు సాయం చేయనోళ్లు.. నేడు తులం బంగారమిస్తమనే మాటను నమ్ముదామా..? ఒకసారి ఆలోచించండి' జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. జగిత్యాల మోతె రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పొరండ్ల గ్రామానికి చెందిన నక్క హరీశ్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు, మహిళలు, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన 20 మంది గంగపుత్ర సంఘం వారు కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులు చెపుతున్నది ప్రతీది అబద్ధమేనన్నారు. మన రాష్ట్రంలో ఆసరా పింఛన్ కింద రూ.2వేలు ఇస్తున్నామని, వచ్చే మార్చి నుంచి రూ.3వేలకు పెంచుకుంటామని, ఏడాదికి రూ.500 చొప్పున నాలుగేండ్లలో రూ.5వేలు చేసుకుంటామని స్వయంగా సీఎం కేసీఆరే చెప్పారని, మ్యానిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా వారి పాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వడం లేదో కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని సూచించారు. పొరండ్ల గ్రామంలో 620 ఇండ్లు ఉంటే 621 మందికి వివిధ రూపాల్లో పింఛన్లు అందిస్తున్నామని, 88 మందికి కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందించామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో రూ.40కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 2014లో గుప్పెడు మందితో లక్ష్మీపూర్ నుంచి ప్రచారం ప్రారంభించి లక్ష ఓట్లు పొందానని, లక్ష్మీపూర్ గ్రామ ఓటర్ల ఆశీస్సులతో ఈ మారు లక్ష ఓట్ల మెజార్టీతో గెలువబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ గాంధేయ మార్గంలో శాంతియుతంగా పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని, కానీ కాంగ్రెస్ హింసా మార్గాన్ని నమ్ముకుందని, ఆ పార్టీ నాయకుడితో ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వారి కుటుంబాలను స్వరాష్ట్రంలో ఆదుకున్నామని, వారి పిల్లలకు ఉద్యోగాలిచ్చి ఆదుకున్నట్లు వివరించారు. లక్ష్మీపూర్‌లో సైతం యువతి ఆత్మహత్య చేసుకుంటే ఆదుకొని ఆ ఇంటికి ఉద్యోగాన్ని కల్పించామన్నారు. అల్లీపూర్‌ను మండలంగా చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బాల ముకుందం, దావ సురేష్, పొరండ్ల ఎంపీటీసీ సౌజన్యతిరుపతి, నాయకులు రవి, పడిగెల గంగారెడ్డి, శేఖర్, సుధాకర్, గంగాధర్, కొర్రి భాగ్య, బొంతల మంగ, నక్క పవన్, బోధనపు తిరుపతి, పవన్, రాజశేఖర్, లక్ష్మీపూర్ సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సభ్యురాలు సునీతలక్ష్మణ్, ఆత్మ చైర్మన్ ఎలేటి రాజిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజిరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, చిన్నగంగయ్య, రత్నాకర్, జనార్దన్, రాజేశ్, నరేష్ ఉన్నారు.

# టీషర్టులపై పథకాలు అభినందనీయం



కమలాకర్‌రెడ్డి రూపొందించిన టీషర్టును ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్, చల్మెడ

గంభీరావుపేట, నవంబర్ 3: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను టీషర్టులపై ముద్రించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం సంతోషకరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్.. కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డిని అభినందించారు. కమలాకర్‌రెడ్డి తన సొంతఖర్చులతో 500టీషర్ట్‌లపై బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ముద్రించగా, శుక్రవారం వేములవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు తో కలిసి ఆవిష్కరించారు. వినూత్న ఆలోచనల ద్వారా ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు.